01ATP17F_01ATP17F.qxd 17-07-2024 PM 10:18 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 18 జూలై 2024 పేజీలు : 04

# ఇదే తోడ్పాటుతో జిల్లాకు మంచిపేరు తీసుకురండి



పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్.పి. ఎస్.వి.మాధవ రెడ్డి



వాహనాన్ని తాళ్ళతో లాగి అభిమానం చాటుకుంటున్న సిబ్బంది

### - బదిలీపై వెళుతున్న ఎస్పికి ఘన వీడ్కోలు

**పుట్టపర్తి, జులై 17, ప్రభాతవార్త**

జిల్లాలో మునుపటిలాగానే రాబోయే అధికారులకు తోడ్పాటు అందించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని శ్రీసత్యసాయి జిల్లా నుండి పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పిగా బదిలీపై వెళుతున్న ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి సూచించారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని పరేడ్ మైదానంలో బదిలీపై వెళుతున్న ఎస్పికి పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవవందనం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా అదనపు ఎస్పి ఎన్.విష్ణు, ఎఆర్‌డిఎస్‌పి విజయ్‌కుమార్ తొలుత పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పరేడ్ కామాండర్‌గా వ్యవహరించి రవికుమార్ నుండి ఎస్పి గౌరవవందనం స్వీకరించి ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంలో పరేడ్ పరిశీలన చేశారు. పోలీస్ డాగ్ ఎస్పికి గౌరవవందనం స్వీకరించగా, సిబ్బంది పరేడ్ వాహనాన్ని తాళ్ళతో లాగి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ, తాను ఈ జిల్లాలో పని చేసిన 15 నెలల కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమని, ప్రధానంగా ఎఆర్, హోంగార్డ్స్ మంచి సేవలు అందించారని కొనియాడారు. బదిలీలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు వెళుతున్నప్పటికీ మీ సేవలను ఎన్నడూ మరువలేనన్నారు. శాంతభద్రత పరిరక్షణ, నేరాల నియంత్రణలో క్లిష్టమైన బందోబస్తు విధులు నిర్వహించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో కార్యక్రమాలు ప్రతి ఒక్కరి కృషి వల్లనే సక్సెస్ చేయగలిగామన్నారు. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ జిల్లాకు మరింత మంచిపేరు తీసుకురావాలని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా పేరుపేరున ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఎఆర్, ఎఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# అందరి సహకారంతో జిల్లాను ముందుకు తీసుకెళతా

### - శ్రీసత్యసాయి జిల్లా ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన వెలిశల రత్న



ఎస్పికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎఎస్పి ఎన్.విష్ణు



ఎస్పిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెలిశల రత్న

**శ్రీసత్యసాయిజిల్లా, జులై 17, ప్రభాతవార్త ప్రతినిధి**

పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా అందరి సహకారంతో జిల్లానుముందుకు తీసుకెళతానని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన వెలిశల రత్న పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఆమె జిల్లా 3వ ఎస్పిగా బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎస్పికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఎఆర్ సిబ్బందిచే గౌరవందం స్వీకరించారు. సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన శ్రీసత్యసాయి జిల్లా ఎస్పిగా తనను నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిజిపిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లాకు ఎస్పిగా రావడం ఆనందంగా ఉందని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతాన్నారు. జిల్లాకు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజలకు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. గంజాయి నిర్మూలనకు కార్యచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటామి, ప్రజలకు జవాబుదారితనంతో పోలీస్ యంత్రాంగం విధులు నిర్వర్తించాలని, అందరూ చట్టానికి లోబడి పని చేయాలన్నారు. ముఖ్యగా రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మీడియా, జిల్లా ప్రజలను సమన్వయం చేసుకొని ప్రశాంతవాతావరణం నెలకొల్పేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పికి అదనపు ఎస్పి ఎన్.విష్ణు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డిఎస్‌పి జడ్.విజయ్‌కుమార్, డిఎస్పిలు శ్రీలత, వాసుదేవన్, కన్జక్షన్, బాజీజామ్ సైదా, శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎఓ సుజాత, సిసి రాఘవేంద్ర, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది తదితరులు ఎస్పికి పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

# జనాల్లో కనిపించని 'జనసేన'

- ❖ కనీస కార్యక్రమాలు కరువు
- ❖ పత్తాలేని జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్
- ❖ నాన్‌లోకల్ కావడంతో పెద్దఎత్తున నిరసనలు
- ❖ నామినేటెడ్ పదవుల్లో అనంతకు న్యాయం జరిగేనా..?



సప్తగిరి సర్కిల్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయం

**అనంతపురం, జులై 17, ప్రభాతవార్త ప్రతినిధి**

అనంతపురం జిల్లాలో జనసేన పార్టీ జనాల్లో కనిపించడం లేదు. జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ స్థానికేతరుడు కావడంతో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో లేకపోవడంతో ఏ కార్యక్రమాలు కూడా ముందుకు సాగడం లేదు. కనీస కార్యక్రమాలు కూడా చేయడం లేదనే ఆరోపణలున్నాయి. జనసేన పార్టీని 2014 సంవత్సరంలో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ స్థాపించారు. ఇప్పటికి 10 సంవత్సరాలు అవుతున్నా కనీసం బూత్ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఆ పార్టీ ఉంది. దీని బట్టి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024 శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమితో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో బరిలో నిలిచారు. ఇందులో తెలుగుదేశం పార్టీ 135 అసెంబ్లీ స్థానాల్లోను, జనసేన పార్టీ 21 స్థానాల్లోను, బిజెపి పార్టీ 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాలు ఉన్నా ఒక సీటు కూడా జనసేన పార్టీకి కేటాయించకపోవడం చూస్తుంటే జిల్లాలో జనసేన పార్టీ ఎంత బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నామినేటెడ్ పదవుల్లో కూడా అనంతపురం జిల్లా జనసేన నాయకులకు న్యాయం జరుగుతుందా లేదా అన్నది వేచి చూడాలి. ఇప్పటికే తారా స్థాయిలో జనసేన పార్టీలో గ్రూపు విభేదాలు, రాజకీయ గ్రూపుల విభేదాలు తారా స్థాయికి చేరాయి. జిల్లా అధ్యక్షులు వరుణ్ స్థానికేతరుడు కావడంతో ఆయన మాటను ఎవరూ పట్టించుకోని దుర్భర పరిస్థితి నెలకొంది. పేరుకే అనంతపురం జిల్లా వాసి అని చెప్పుకుంటున్నా ఆయన స్థిర నివాసం, వ్యాపారాలు అన్నీ హైదరాబాద్‌లో ఉంటునానయి. దీంతో నెలకు రెండు మూడు రోజులు మాత్రమే అనంతపురానికి వస్తూపోతూ ఉంటుండడంతో పార్టీ కార్యక్రమాలు ఏమీ జరగక బలహీనపడింది. పైగా ఆయన ఎవరినీ ఎదగనివ్వరని, అంతా తానై వ్యవహరిస్తుం డడంతో ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జనసేన పార్టీ మనుగడ ప్రమాదంలో పడింది.

**జిల్లా అధ్యక్షుడు స్థానికేతరుడు అంటూ...**



జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్

జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ స్థానికేతరుడు కావడంతో సమస్య మరింతగా ముదురు తోందని ఆ పార్టీ కార యకర్తలే బహిరంగంగా చెప్పుకుంటు న్నారు. ఆయన వాస్తవంగా స్థానిక నివాసం, వ్యాపారాలు, ఫ్యామిటీ అన్ని హైదరాబాద్ లోనే ఉన్నాయని ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే చెప్పుకుంటు న్నారు. కొన్ని కారణాల వల్ల అనంతపురం జిల్లా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం అనంతపురం అర్బన్ ఇన్‌ఛార్జి ఆయనే, జిల్లా అధ్యక్షులు కూడా ఆయనే. వ్యాపారాల నిమిత్తం ఎప్పుడూ హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంతో జిల్లాలో కనిపించడం అరుదుగా మారింది. లోకల్‌గా ఉండకపోవడంతో నాయకుల మధ్య సమన్వయం చేసి పార్టీని ముందుకు నడిపించలేని పరిస్థితి ఉంది. పైగా జనాల్లో వెళ్లకపోవడంతో ఆయనకు పెద్దగా గుర్తింపు లేకుండా పోయింది. కొందరు జిల్లా నాయకులు పార్టీ కోసం పని చేస్తున్నా పెద్దగా గుర్తింపు రావడం లేదు.

**అసెంబ్లీ ఎన్నికల్లో చివరి వరకు జనసేనకే సీటు కేటాయింపు...?**

ఈ సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అసెంబ్లీ సీటు పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి వస్తుందని భావించారు. రాష్ట్ర స్థాయిలో కూడా అర్బన్ నియోజకవర్గం తమకే ఇస్తారని జనసేన నాయకులు కూడా సంబరాలు కూడా చేసుకున్నారు. కానీ నియోజకవర్గంలో ఆ పార్టీ పరిస్థితి బలహీనంగా ఉంటుండడం, జిల్లా అధ్యక్షులు స్థానికేతరుడు కావడం, కనీసం బూత్ స్థాయి కమిటీలు కూడా లేకపోవడంతో ఎన్నికల్లో పని చేయలేమనే భావన ఏర్పడింది. నాయకుల్లో విబేదాలు ఉండడం, కనీసం పార్టీ కార్యక్రమాలు జరగకపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ సరిగా పని చేయలేదని, సీటు కేటాయించినా గెలవలేని, గెలిపించుకోలేని పరిస్థితి ఉందని భావించిన అధిష్టానం తప్పని పరిస్థితుల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపికి కేటాయించాల్సి వచ్చింది. టిడిపికి సీటు కేటాయించినా జనసేన నాయకులు సరిగా పని చేయలేదనే వాదనలు ఉన్నాయి.

**నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరిగేనా..?**

ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 నియోజకవర్గాల్లో ఏ ఒక్క సీటు కూడా జనసేన పార్టీకి కేటాయించలేదు. ప్రస్తుతం నామినేటెడ్ పదవులు చాలా వరకు ఉన్నాయి. ఇందులో జనసేన పార్టీ నాయకులకు కేటాయించి న్యాయం చేస్తారా అన్నది చూడాలి. అనంతపురం జిల్లా అధ్యక్షులు వరుణ్ కూడా ఈ రేసులో ఉన్నట్టు సమాచారం. కానీ అనంతపురం జిల్లా కోటాలో వరుణ్‌కు ఏదైన నామినేటెడ్ పదవి కేటాయిస్తే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నిరసన వచ్చే ప్రమాదం ఉంది. విభేదాలు కూడా తారా స్థాయికి చేరుతాయి. దీంతో స్థానికులకే ఆ పదవులు కేటాయించాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

**జనసేన పార్టీ బలపడేనా..?**

ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో జనసేన పార్టీ బలపడేనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూపు రాజకీయాలు, విభేదాలు పెద్దఎత్తున ఉంటుండడంతో పార్టీ బలపడడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ద్వితీయశ్రేణి నాయకులను ఎవరినీ ఆయన ఎదగనివ్వరని, పది సంవత్సరాలుగా జనసేన జిల్లా అధ్యక్షులుగా ఉంటుండడంతో తీవ్ర సమస్యలు నెలకొంటున్నాయని సీనియర్ నాయకులు ఆరోపిస్తున్నారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలపరిచే స్థానిక నాయకులకే జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పాలని కొందరు నాయకులు, కార్యకర్తలు బలంగా కోరుతున్నారు. దీనిపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చొరవ చూపి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. రానున్న సంచికలో పది సంవత్సరాల కాలంలోను, ఈ అసెంబ్లీ ఎన్నికల్లోను జనసేన పార్టీ బలాలు, బలహీనతలపైన, అధ్యక్షుని వైఖరితో ఆ పార్టీలో విభేదాలుపైన, గ్రూపు రాజకీయాలు వంటి వాటిపై మరిన్ని వరుస కథనాలు రానున్నాయి.

# క్రియాశీలక రాజకీయాల్లోకి జెఎల్ మురళీధర్

- ❖ రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి వరించే అవకాశం
- ❖ అహుడా ఛైర్మన్‌గా ఇచ్చేందుకు సుముఖం
- ❖ ఓటమి ఎరుగని నాయకునిగా గుర్తింపు
- ❖ జెఎల్ ఆధ్వర్యంలో అగ్రపథంలో అర్బన్ బ్యాంకు

**అనంతపురం, జులై 17, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రజల నాయకునిగాను, ఓటమి ఎరుగని నాయకునిగాను, యువత ఫాలోయింగ్ ఉన్న నాయకునిగాను జెఎల్ మురళీధర్‌కు మంచి గుర్తింపు ఉంది. టిడిపి తరుపున అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రేసులో కూడా ఆయన అగ్రస్థానంలో ఉన్నారు. కానీ కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే సీటు వరించలేదు. అయినా పార్టీ గెలుపు కోసం అహర్నిషలు శ్రమించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం రాష్ట్ర స్థాయిలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ నామినేటెడ్ పదవి ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇది కాకపోయినా అహుడా ఛైర్మన్‌గా ఉండాలని అధిష్టానం కోరుతున్నట్టు సమాచారం. కానీ ఆయన రాష్ట్ర రాజకీయాల వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆ స్థాయిలోనే నామినేటెడ్ పదవి వరించనుంది. ఏ విషయమైనా అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం, ఓటమి ఎరుగని నాయకునిగా గుర్తింపు ఉండడంతో అనంతపురం జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ ఆయన పేరును అధిష్టానానికి ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం.

**విద్యార్థి దశ నుంచే నాయకత్వపు లక్షణాలు...**

పదోతరగతి చదువుతున్న సమయం నుంచి నాయకత్వపు లక్షణాలను జెఎల్ మురళి అలవర్చుకున్నారు. అప్పుడే విద్యార్థుల సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం మొదలెట్టారు. పదోతరగతిలో స్కూల్ పీపుల్ లీడర్‌గా పని చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో కాలేజీలో కార్యదర్శిగా నియమితులయ్యారు. రెండో సంవత్సరంలో ఆ కాలేజీ ఛైర్మన్‌గా పని చేశారు. దీని బట్టి ఆయన నాయకత్వపు లక్షణాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. తన విద్యార్థి సంఘం నాయకునిగా ఉన్న సమయంలో అనేక విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్‌తో విద్యార్థుల సమస్యలపై మాట్లాడడం, వారి పరిష్కారానికి కృషి చేస్తుండడంతో మంచి నాయకునిగా గుర్తింపు పొందారు. అప్పటి నుంచే ఆయనకు విద్యార్థులతో పాటు యువత ఫాలోయింగ్ కూడా పెరుగుతూ వచ్చింది.

**ఓటమి ఎరుగని రాజకీయ నాయకునిగా గుర్తింపు**

ఓటమని ఎరుగని రాజకీయ నాయకునిగా పలువురి చేత గుర్తింపు పొందారు. ఎందరో సీనియర్ నాయకులు కూడా ఆయనను ప్రశంసించే వారు. 2005 సంవత్సరంలో అనంతపురం మున్సిపాల్టీ



అనంతపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్, టిడిపి రాష్ట్ర నాయకులు జెఎల్ మురళీధర్

నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత 3వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలుపొందారు. 2007 సంవత్సరంలో ఏడు మున్సిపాల్టీలు, కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్లానింగ్ కమిటీ సభ్యులుగా గెలిచారు. ఇలా అంచెంచెలుగా ఎదుగుతూ అటు సీనియర్ పార్టీ నాయకులతోను, ఇటు యువతతోను మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన బలిజ సంఘం చీఫ్‌విప్‌గాను, రాష్ట్ర కాపు యువత అధ్యక్షుడిగాను పని చేశారు. అంతేగాక ఆయన రాయల్ యూత్ ఫౌండర్ కూడా.

**అభివృద్ధి పథంలో అర్బన్ బ్యాంకు...**

అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో రెండు సార్లు గెలిచి తనదైన మంచి గుర్తింపు, పేరు, ప్రఖ్యాతులను తెచ్చుకున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలోనే మరువలేని విధంగా గెలిచి టిడిపి పార్టీకి మంచి పేరు తెచ్చారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర స్థాయిలో జెఎల్ మురళీధర్ పేరు మారుమోగింది. అర్బన్ బ్యాంకులో 22,000 కుటుంబాలకు రుణాలు ఇచ్చి, వారి ఆర్థిక అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారు. రూ.3 కోట్ల డిపాజిట్ స్థాయిలో ఉన్న అర్బన్ బ్యాంకుకు జెఎల్ మురళీధర్ ఛైర్మన్‌గా అయిన వెంటనే వందల కోట్ల రూపాయల డిపాజిట్లు వస్తున్నాయి. ఆయన తీసుకున్న పలు చర్యల వల్ల బ్యాంకులో మార్పులు వచ్చాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. డిపాజిట్లు వందల కోట్ల రూపాయలు వస్తున్నాయి. పేదలకు రుణాలు అందుతున్నాయి. కార్పొరేట్ బ్యాంకుల ధీటుగా అభివృద్ధి బాటలో అర్బన్ బ్యాంకు వెళ్తోంది.

**యువ నాయకునిగా మంచి గుర్తింపు...**

ఆయనకు యువత ఫాలోయింగ్ పెద్ద సంఖ్యలో ఉంది. విద్యార్థుల్లో గుర్తింపు, టిడిపి పార్టీ కార్యకర్తల సహకారం, కుల, మతాలకు అతీతంగా ఆయనకు లభిస్తున్న ఆదరణ చూస్తే తెలుస్తోంది. చాలా మంది సీనియర్ నాయకులతో పాటు అటు టిడిపి, ఇటు వైసిపి నాయకులతో ఆయనతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. ఆయనకు ఉన్న మంచితనం, రాజకీయ అనుభవం, యువత ఫాలోయింగ్, మహిళలు, బిసిలు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు ఇలా ప్రతి ఒక్కరూ ఆయన అంటేనే విపరీతమైన అభిమానం చూపిస్తున్నారు. వివాదాలకు దూరంగా ఉండే ఆయన్ను ప్రతి నాయకుడు కూడామెచ్చుకునేలా తన నడవికతతో పలువురి మన్ననలను పొందుతున్నారు.

**అహుడా ఛైర్మన్‌గా పదవి వరించే అవకాశం...**

అహుడా ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవి ఆయన్ను వరించే అవకాశం ఉంది. లేదా కాపు కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. రానున్న సంవత్సరంలో అనంతపురం నగర పాలక సంస్థ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మేయరు అభ్యర్థిగా కూడా ఆయన పేరును చాలా మంది నాయకులు ప్రతిపాదిస్తున్నారు. ఆ వైపుగా కూడా దృష్టి సారించే అవకాశం ఉంది. గతంలో కార్పొరేటర్‌గా గెలిచిన ఆయన 2007 సంవత్సరంలో ఏడు మున్సిపాల్టీలు, కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్లానింగ్ కమిటీ సభ్యులుగా గెలిచారు. నగర పాలకలో ఉన్న సమస్యలపైన, ప్రజాసమస్యలపై మంచి అవగాహన కూడా ఉంది. వైసిపి ప్రభుత్వ హయాంలో అహుడా ఛైర్మన్‌గా బలిజ సమాజానికి వర్గానికి చెందిన మహాలక్ష్మి శ్రీనివాస్‌కు నామినేటెడ్ పదవి వరించింది. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు అదే సామాజిక వర్గానికి చెందిన జెఎల్ మురళికి కూడా అహుడా ఛైర్మన్ పదవి ఇవ్వాలని టిడిపి అధిష్టానం ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. జెఎల్ మాత్రం ఆయన దృష్టి అంతా రాష్ట్ర రాజకీయాల వైపు సారించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్టానం తగిన ప్రాధాన్యత ఇస్తుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వైసిపి చేసిన భూదందాలు, సహజ వనరుల దోపిడీ గురించి ప్రజలకు తెలియాలి

### అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్

**అనంతపురం, జూలై 17 ప్రభాతవార్త బ్యూరో**

ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన భూదందాలు, సహజవనరుల దోపిడీ గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ అన్నారు. అనంతపురం జిల్లా టిడిపి కార్యాలయంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ వైసిపి పాలనలో జరిగిన అక్రమాల గురించి ప్రజలంతా తెలుసుకోవాల్సిన అవసరం వుందన్నారు. అందుకే శ్వేత పత్రం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వివరాలు వెల్లడిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటి విలువ దాదాపు 35,576 కోట్ల పైనే వుంటుందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో దాదాపు 9,750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒ 512ను తమ ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసిపి నేతలు భూదోపిడీకి పాల్పడ్డారని, ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేద ప్రజల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారని విమర్శించారు. రుషికొండలో 500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృధా చేశారని, రీ సర్వే పేరుతో పాసుబుక్‌పై జగన్ చిత్రం ముద్రించుకోవడం ఏంటని ప్రశ్నించారు. కొండలను సైతం జగన్ ప్రభుత్వం అనకొండల్లా మింగేసి గుండులు కొట్టేశారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఖచ్చితంగా విచారణ చేసి ప్రతి ఎకరాను రికవరీ చేస్తామన్నారు. వైసిపి చేసిన అక్రమాలన్నీ సాక్షాదారాలతో శ్వేత పత్రం ద్వారా విడుదల చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, బలిజ సంఘం నాయకులు రాహుల్, మధు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

# తుంగభద్రకు పోటెత్తుతున్న వరద



నిండుకుండలా మారిన తుంగభద్ర డ్యాం

**రాయదుర్గం, జూలై 17 ప్రభాతవార్త:**

ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు వరప్రదాయిని అయిన కర్ణాటక రాష్ట్రంలోని హోసపేట వద్ద ఉన్న తుంగభద్ర జలాధయానికి వరద నీరు పోటెత్తుతోంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరదనీరు అధిక సంఖ్యలో చేరుతోంది. బుధవారం డ్యాంలోకి 63,320 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 212క్యూసెక్కులు నమోదైంది. తుంగభద్ర డ్యాం గరిష్ట నీటి నిలువ 105.788 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 39.718టిఎంసీలు నీరు నిలువ ఉందని డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. దీంతో నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వైభవంగా శ్రీరుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మారథోత్సవం



బ్రహ్మారథోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

**హిందూపురం, జూలై 17 ప్రభాతవార్త**

దక్షిణాయనం ప్రారంభం సందర్భంగా తొలి ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో బుధవారం వైభవంగా శ్రీరుక్మిణీ పాండు రంగస్వామి బ్రహ్మారథోత్సవ వేడుకలు జరిగాయి. నంది సర్కిల్ నుండి గోవింద నామస్మరణ మధ్య భక్తులు రథాన్ని లాగారు. అంతకుముందు శ్రీపాండురంగస్వామి ఆలయంలో అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఉత్సవ విగ్రహాలను రథంపై తీసుకొచ్చి ప్రతిష్టించిన తరువాత భారీ భక్తజన సందోహం మధ్య రథోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ మద్దన జయప్ప, అధ్యక్షులు పల్లా లక్ష్మీకుమార్, ధర్మకర్త చింతా గోపాల్, టిడిపి నేత పామిశెట్టి చంద్రశేఖర్, డిసి ఆనంద్‌బాబు, డైరెక్టర్లు భాస్కర్, మనోహర్, పల్లా చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శుద్ధ ఏకాదశి పూజలు...

రాయదుర్గం, జూలై 17 ప్రభాతవార్త:



ప్రత్యేక అలంకరణలో ఉన్న రుక్మిణి పాండురంగస్వామి

పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డులో వెలసిన రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయంలో బుధవారం శుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు అనంతోజోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయాన్నే గంగపూజ, వంచామృతాభిషేకం, పుష్పఅలంకరణ, ఉదయం 6.30నిమిషాలకు గణపతి పూజ, 7గంటలకు స్వామి అభిషేకం, సాయంకాలం 7గంటలకు స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే నేడు గురువారం మధ్యాహ్నం 12.30నిమిషాలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు పేర్కొన్నారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పాండురంగస్వామి ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

## ముగిసిన మొహరం వేడుకలు....

రాయదుర్గం, జూలై 17 ప్రభాతవార్త:



పట్టణంలో ఊరేగుతున్న పీర్లు...

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పీర్ల చావిడిలో వెలసిన పీర్ల బుధవారం పెద్ద సరిగెత్తు తో మొహరం వేడుకలు ముగిసాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద మసీదు, ఉచ్చుబాయి మసీదు, చమ్మామసీదు, కుమ్మరి మసీదు, నిమ్మకాలయ మసీదు తదితర మసీదుల్లో ఉన్న పీర్లను మంగళవారం రాత్రి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం అందించారు. అనంతరం భక్తులు పీర్లకు చెక్కర చదివింపులు చేయించి వారి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆయా మసీదుల్లో ఉన్న పీర్లు ఆగ్నిగుండ ప్రవేశం చేసి, కోట ప్రాంతంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన రహదారి వద్ద తప్పెట్లు, మేళాలు, బాణాసంచాలు మధ్య భారీ ఊరేగింపు నిర్వహించారు. అలాగే సాయంకాలం పీర్లకు ప్రత్యేకంగా పుష్పాలతో సర్వసుందరంగా అలకరించి భక్తులకు ప్రదర్శనల ద్వారా దర్శనం అందించారు. అనంతరం వందలాది మంది భక్తులు కోట ప్రాంతానికి చేరుకొని పీర్లను దర్శించుకున్నారు. దీంతో మొహరం వేడుకలు బుధవారం నాటికి ముగిశాయి.

## తొలి ఏకాదశికి శ్రీ లక్ష్మీరంగనాథస్వామికి ప్రతేక పూజలు

బ్రహ్మసముద్రం జూలై 17 ప్రభాతవార్త,



మండంలోని వేపులపర్తిలో వెలసిన శ్రీ లక్ష్మీరంగనాథస్వామి అలయంలో అలయ కమిటీ సభ్యాలు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వయం భూఉద్భవ శ్రీ లక్ష్మీరంగనాథస్వామికి పూజారులు ఈఅభిశేకంచేసి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించి భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే కొంగుభంగారంగా భక్తాదులకు దర్శనమిచ్చి ప్రజలకు దర్శనార్థం స్వామివారికి అలంకరణతో ప్రజలకు దర్శనం ఇచ్చారు.

## మండలంలో ఘనంగా మొహరం పండుగ

బ్రహ్మసముద్రం జూలై 17 ప్రభాతవార్త,



జలధికి ముస్తాబైన పీర్లు

వుండలోని ఎరడికెర, వేపులపర్తి, గుండిగానివల్లి, బ్రహ్మసముద్రం. భైరనముద్రం, గ్రామాలలో ఘనంగా మోహారం వేడుకలు నిర్వహించారు. ముస్లీంలు తమ ఇష్టదైవం అయిన పీర్లస్వామిని ముడురోజులపాటు భక్తిశ్రద్దలతో పూజించి పురవీధుల్లో ప్రజల ఇంటివద్దకు పీర్లస్వామిని దర్శనార్థం తీసుకెళ్లి ప్రజలకు స్వామిని దర్శనమిస్తు భుధవారం సాయంత్రం పీర్లస్వామిని అగ్నిగుండ ప్రవేశం అనంతరం జలధికి తీసుకెళతారు. పీర్లస్వామికి ముస్లీంలే కాకుండా హింధువులుకూడా అత్యంత భక్తి శ్రద్దలతో పూజించి స్వామివారిని కొలుస్తారు. అ కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

## జర్నలిస్టులను దురుసుగా మాట్లాడిన ఎంపిపై చర్యలు తీసుకోండి...

రాయదుర్గం, జూలై 17 ప్రభాతవార్త:



పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు...

రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఇటీవల విశాఖపట్నంలో జర్నలిస్టులను దురుసుగా మాట్లాడారని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపిడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని జరల్నిస్టుల తో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఆత్మాభిమానందెబ్బతీసేలా విజయసాయిరెడ్డి మాట్లాడటం తగద న్నారు. ముఖ్యంగా మహాటివి, ఏబిఎన్, ఈటివి2, టివి5 జర్నలిస్టులు, మీడియాపై ఇష్టాను సారంగా మాట్లాడటాన్ని నియోజకవర్గం జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతనిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆవుట మనోహర్, శివ, సవరప్ప, విరుపాక్షి, నాగభూషణం, విద్యార్థి సంఘాల నాయకులు బంగి శివ, కొట్రేష్, అనిల్, ఆంజి తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహాహాత్మాగాంధి విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు.

## ఘనంగా పీర్ల జలది వేడుకలు...

డి.హీరేహాళ్, జూలై 17 ప్రభాతవార్త:



పీర్లను జలదికి తరలిస్తున్న భక్తులు

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పీర్లను జలది కార్యక్రమ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న పీర్లను ప్రత్యేకంగా అలంకరించి బుధవారం తెల్లవారుజామున ఆగ్నిగుండ ప్రవేశం చేసిన అనంతరం సాయంకాలం డబ్బు వాయిద్యాల మధ్య కోలాహలంగా పీర్లను ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# పర్సంటేజీ ఇస్తేనే పనిచేస్తా..!

- ఆర్‌డబ్ల్యుఎస్‌లో అవినీతి ఇంజనీర్ హల్‌చల్ - ఎం బుక్ రికార్డులో చేతివాటం
- బెంబేలెత్తుతున్న పంచాయతీ కార్యదర్శులు - టిడిపి సర్కారులోనూ వీడని అవినీతి జాడ్యం

హిందూపురం టౌన్, జూలై 17 ప్రభాతవార్త




హిందూపురం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అవినీతి మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. పని ఏదైనా పర్సన్ ఎవరైనా సరే పర్సంటేజీ ఇవ్వనిదే పని చేయదు ఆ ద్వితీయశ్రేణి అధికారి అవినీతికి పంచాయతీ కార్యదర్శులు బెంబేలెత్తుతున్నారు. ప్రశ్నించలేక పైసలు ఇచ్చుకోక సతమతమవుతున్నారు. కథనానికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. గ్రామాల్లో నీటి వసతి, బోర్ల మరమ్మతులు, నూతనబోర్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యాలకు తదితర సమస్యలకు సంబంధించి ఏ పని చేసినా బిల్లుల కోసం పంచాయతీ కార్యదర్శులు ఏ పనిచేశాము ఎంత ఖర్చు చేశాము అన్నది క్లుప్తంగా రూరల్ వాటర్ సర్వీస్ (ఆర్‌డబ్ల్యుఎస్) ఏఇ ద్వారా ఏం బుక్ రికార్డు (మెజర్మెంట్) చేయించాలి. దీని కోసం ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ (ఏఇ) పంచాయతీ కార్యదర్శుల వద్ద నుండి బిల్లు మొత్తంలో 10 శాతం పర్సంటేజీ వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించి వాటి యొక్క బిల్లులు మంజూరు కోసం ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లను సంప్రదిస్తే గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా తయారైంది పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. నిధులు లేక గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడంలో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ అవినీతి దాహాన్ని తీర్చలేకపోతున్నామంటూ ఆ వర్గాల్లో చర్చ సాగుతోంది. వాస్తవానికి పంచాయతీల్లో ఖర్చుచేసిన బిల్లులకోసం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేపట్టే కొలతల పుస్తకం విధానం తీవ్ర పారదర్శకతతో వుండాలి లేదంటే ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం వుంది కానీ నిబంధనలు తుంగలో తొక్కి ఖర్చు చేసింది కొంత అయితే ఏం బుక్ రికార్డుల్లో చూపించేది రెండింతలు ఈ అవినీతి అధికారిని ఇష్టారాజ్యంగా కొలతల పుస్తకం తయారు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోంది. మేడంకు పర్సంటేజీ ఇస్తే ఒక్కరోజులో పని అయిపోతుందని లేదంటే పని జరగదు ఇదేమిటని ప్రశ్నిస్తే నెలలు గడిచినా ఫైలు కదలదు. ఆఅధికారిని ఎదిరించలేక ఉన్నతాధికారులకు చెప్పుకోలేక పంచాయతీ కార్యదర్శులు ఆమె అవినీతి దాహాన్ని తీర్చక తప్పడం లేదు అంటూ ఆ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక డిప్యూటి సిఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ తన శాఖలో అవినీతికి చోటు లేకుండా పారదర్శకంగా ప్రజలకు పాలన అందించాలన్న ముఖ్యఉద్దేశ్యాన్ని ఇలాంటి అధికారులు నీరుగారుస్తున్నారు అన్నది నిజం. టిడిపి సర్కారులోనూ సదరు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అవినీతి జాడ్యం వీడలేదని చర్చ సాగుతోంది. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు స్పందించి లోతుగా విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు బయటపడే అవకాశం లేకపోలేదు.

## మొక్కలు పెంపకంతోనే మానవ మనుగడ... బండి

డి.హీరేహాళ్, జూలై 17 ప్రభాతవార్త:



మొక్కలు నాటుతున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

మొక్కల పెంపకంతోనే ప్రకృతి ఆహ్లాదకరం చోటు చేనుకుంటుందని మానవ మనుగడ దోహద పడుతుందని రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అద్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప తెలిపారు. బుధవారం రాయదురనగం పట్టణంలోని సివిల్‌సప్లై గోదాము ఆవరణలో ఆయన లక్ష్మీనారాయణ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు, సివిల్‌సప్లై డిటి. సుధాకర్‌లతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సివిల్‌సప్లై మేనేజర్ ఆదేశాల మేరకు గోదాము ఆవరణలో 70మొక్కలు నాటడం జరిగిందని, నాటిన మొక్కలను గోదాము సిబ్బంది, యూనియన్ హమాలీలతో కలిసి సంరక్షించి ఎపెద్ద చెట్లుగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తల్లి, తండ్రి, గురువు, దైవం పేరున మొక్కలు నాటి సంరక్షించాలని కోరుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి హమాలి యూనియన్ సభ్యులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## పుష్పవతికి న్యాయం జరగకపోతే ఆందోళన చేపట్టేందుకు కూడా వెనుకాడబోము...సీపీఎం

డి.హీరేహాళ్, జూలై 17 ప్రభాతవార్త:



బాలికను పరామర్శిస్తున్న సీపీఎం ఎం.మల్లికార్జున

మండల పరిధిలోని ఎం.హనుమాపురం గ్రామానికి చెందిన వన్నూరప్ప కుమార్తె పదవ తరగతి చదువుతున్న పుష్పవతి చదువుకునేటప్పటి నుండే అదే గ్రామానికి చెందిన వన్నూరప్ప కుమారుడు మంజునాథ మాయమాటలు చెప్పి అమ్మాయిని లోపరుచుకుని గర్భిణి చేశాడని ఆ అమ్మాయికి న్యాయం జరగకపోతే ఆందోళన చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని సీపీఎం మండల కార్యవర్గసభ్యులు ఎం.మల్లికార్జున, హెచ్.గంగాధరలు పేర్కొన్నారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న వారు రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పుష్పవతిని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం తండ్రితో కలిసి గ్రామానికి చేరుకున్న ఆమె తన కడుపులో బిడ్డ పెరుగుతుందన్న విషయం గురించి తండ్రికి, అన్నకు చెప్పలేకపోయిందని, మంగళవారం మధ్యాహ్నం కడుపునొప్పి అంటూ బాధపడుతఉన్న ఆమెను తండ్రి రాయదుర్గంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడని, అక్కడి వైద్యులు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చాడన్నారు. పరీక్షించిన వైద్యులు ఆమె పురటి నొప్పులతో బాధపడుతున్నట్లు గుర్తించి వెంటనే కాన్పులకు వార్డులో తీసుకెళ్లారని తెలిపారు. కొద్ది సేపటికి తర్వాత ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, విషయం తెలుసుకున్న తండ్రి, బందువులు తోలుతా ఆందోళనకు గురయ్యారన్నారు. జరిగిన విషయం మొత్తం యువతి ద్వారా తెలుసుకుని పెద్దలు ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పెళ్లి చేయాలని నిశ్చయించారన్నారు. కానీ మోసం చేయాలని చూస్తే పుష్పవతి మరియు వారి తండ్రి, అన్న బంధుమిత్రుల సహాయంతో ఆ బాలికకు న్యాయం చేసేందుకు ఆందోళన చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని వారు హెచ్చరించారు.

## జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలి

మడకశిర జులై 17 ప్రభాతవార్త;



ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

విశాఖ మీడియా సమావేశంలో జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా ఎంపి విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. విజయసాయి రెడ్డి డౌన్ డౌన్, విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ వైఎస్ఆర్‌సర్కిల్ నుండి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్లో వినతిపత్రాన్ని అందించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులను అసభ్యకరంగా నిందించిన విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు విన్నవించుకుంటున్నామని జర్నలిస్టులు తెలిపారు. విజయసాయిరెడ్డి బహింగక్షమాపణచెపాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో నిరసనలు రాస్తారోకోలు చేస్తామని జర్నలిస్టులు హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టులు

## భక్తిశ్రద్ధలతో ఆషాడ తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు

- మొదలైన 4 నెలల చాతుర్మాస వ్రతం

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త



పాండురంగస్వామి రుక్మాదేవిల మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



ప్రత్యేకాలంకరణలో వెంకటేశ్వరస్వామి మూలవిరాట్

స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం ఆషాడ తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి. తొలి ఏకాదశి రోజు నుండి శ్రీమహా విష్ణువు యోగ నిద్రలోకి వెళ్తారని చెబుతుంటారు. ఏకాదశి తిథి 16న మంగళవారం రాత్రి 8.33 గంటలకు ప్రారంభమై 17న బుధవారం రాత్రి 9.02 గంటలకు ముగియనుండటంతో బుధవారమే భక్తులు పండుగను జరుపుకున్నారు. తొలి ఏకాదశి రోజున ఏ చిన్న పనిచేసినా అది వెయ్యి రెట్లు ఫలితాలను ఇస్తుందని చెబుతుండటంతో అనేక మంది ఉపవాస దీక్ష చేపట్టారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోగల పురాతన పాండురంగ స్వామి ఆలయంలో పాండురంగస్వామి, రుక్మాదేవి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు కొనసాగాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. స్థానిక భద్రప్పబావి వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. విఠల్ రుక్మిణీ ఆలయంలో విఠల్ భగవానుడు, రుక్మిణీదేవి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరిగాయి. యాదవ కళ్యాణ మండపంవద్దగల వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పంచామృతాభిషేకం, తిరుమంజనం, తులసి అర్చన పుష్పాలంకరణ, ప్రసాద వితరణ కార్యక్రమలు అర్చకులు కరణం సాయికృష్ణ ఆధ్వర్యంలో కొనసాగాయి.

## వైభవంగా పీర్ల దేవుళ్ల ఉత్సవాలు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం, జూలై 17 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలో హిందూ, ముస్లింసోదరులు ఘనంగా పీర్ల దేవుళ్ల ఉత్సవాలను మంగళ, బుధవారం వైభవంగా జరుపుకున్నారు. బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండంలోకి కట్టెలు, ధాన్యాలు భక్తులు తీసుకొచ్చి వేశారు. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. పీర్లదేవుళ్లకు ప్రత్యేక పూలతో అలంకరణ చేసి ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు చక్కెర చదివింపులు చేశారు. పీర్ల దేవుళ్లను శ్రీచోళమాంబ దేవి దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అమరాపురం గ్రామంలో పీర్ల దేవుళ్లను ఊరేగింపుగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా బసవనపల్లి, పేలుబండ, శివరం, నిద్రగట్ట, తదితర గ్రామాల్లో కూడా పీర్ల దేవుళ్ల ఉత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహించారు.

## పుట్టపర్తిలో ప్రారంభమైన మొహరం వేడుకలు

పుట్టపర్తి రూరల్ జులై 17 ప్రభాతవార్త



చావిట్లో కొలువుతీరిన పీర్ల స్వాములు.

సర్వమతాలకు నిలయమైన పుట్టపర్తి శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో మోహరం వేడుకలు వైభవంగా మంగళవారం రాత్రి ప్రారంభమైనాయి. ఈ కార్యక్రమాన్ని ముస్లిం మత పెద్దలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి పీర్ల పెట్టెను ఊరేగింపుగా తీసుకొని చావిటికి చేరుకున్నారు. అనంతరం వాటిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ప్రాణ ప్రతిష్టను నిర్వహించారు. అనంతరం ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ మోహరం వేడుకలలో భాగంగా 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు, తిరిగి సాయంత్రం అన్నీ పీర్లను ఊరేగిస్తారాన్నరు. 21వ తేదీ రాత్రికి కరణం గోపాల్‌రావు పీర్లను, 22న రాత్రికి అన్ని పీర్లను ఊరేగించి, 23న మంగళవారం సాయంత్రం 4 గంటలకు జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దీంతో మోహరం వేడుకలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలతో పాటు, యువకులు షామీర్, షాకీర్, అల్లాబకాష్, జావిద్, ఫయాజ్, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

## తొలిఏకాదశి ప్రత్యేక పూజలు

గుత్తి, జూలై 17 ప్రభాతవార్త



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తొలిఏకాదశి పురస్కరించుకుని గుత్తి, గుత్తిఆర్ఎస్, గ్రామీణ ప్రాంతాల్లోని పలు దేవాలయాల్లో బుధవారంనప్రత్యేక పూజలు గావించారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసినేపల్లి లోని గద్దెరాళ్ల తిమ్మప్పస్వామి ఆలయంలో అర్చకులు సుధీంద్రనాథ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో విష్ణుసహస్రనామపారాయణం గావించారు. అనంతరం ఆలయ కమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## రాయితీపై నిత్యావసరవస్తువుల పంపిణీ కేంద్రం ప్రారంభం

గుత్తి, జూలై 17 ప్రభాతవార్త



పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పట్టణంలో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రాయితీపై నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రం ప్రారంభమైంది. మర్చంట్ అసోసియేషన్ సహకారంతో తాడిపత్రి రోడ్డులో వున్న కైలాస్ ట్రేడర్స్ దుకాణంలో ఈ కేంద్రాన్ని పౌరసరఫరాలశాఖ డిప్యూటి తహశీల్దార్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు కిలో 160 రూపాయలు, నాణ్యమైన బియ్యం కిలో 48 రూపాయల చొప్పున ప్రజలకు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంకదారు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జలదికి తరలిన పీర్ల స్వాములు

గుత్తి, జూలై 17 ప్రభాతవార్త



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలైన బేతాపల్లి, లచ్చానుపల్లి, జక్కలచెరువు, తురకపల్లి, అబ్బేదొడ్డి, మార్నెపల్లి తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పీర్ల స్వాములను పురవీధుల్లో ప్రదర్శన గావించిన అనంతరం జలదికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా పత్తికొండ రహదారిలోవున్న పీర్లబావి వద్ద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నబీరసూల్ ప్రత్యేక బందోబస్తు గావించారు.

## గుత్తికోటను అభివృద్ధి పరచండి

గుత్తి, జూలై 17 ప్రభాతవార్త



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

చారిత్రక ప్రాధాన్యత కలిగిన గుత్తికోటను పర్యాటకపరంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోవాలని గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలో వున్న పురాతన కట్టడాలను పునర్‌నిర్మించాలని పర్యాటకుల సౌకర్యార్థం హరిత హోటల్ ఏర్పాటు చేయాలని, రోప్‌వే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా పర్యాటక అధికారి జయకుమార్‌కు వినతిపత్రం అందచేశారు.

## 21న గురు పౌర్ణమిరోజు ఉరవకొండలో గిరి ప్రదక్షిణ

-గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామిచే జ్యోతి ప్రజ్వలన

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త



ఉరవకొండ కొండ దృశ్యం (ఫైల్ ఫోటో)

ఈనెల 21వ తేదీన గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా ఉరవకొండలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగనుంది. ఉరవకొండ కొండపై వెలసిన బడే సోమప్పస్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై బడే కొండపైగల సోమప్పస్వామి ఆలయంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం స్థానిక మూగబసవన్న కట్ట వద్ద నుండి త్రివేణి సంగమ జలం, కాశీ గంగాజలంచే గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని భక్తులు తెలిపారు. గిరి ప్రదక్షిణ ఆదివారం సాయంత్రం 4 గంటల నుండి భక్త మార్కండేయస్వామి, రామలింగ చౌడేశ్వరి ఆలయంలోని రామలింగేశ్వర స్వామి, నీలకంఠేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పరమేశ్వరస్వామి, కాశీలింగేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, వీరభద్రలింగేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి ఆలయంలోని శివయ్యస్వామి, నుంజుండేశ్వరస్వామి, గవి సిద్దేశ్వరస్వామి, బడే సోమనాథేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని వివరించారు.

## మొహర్రం పండుగ వేడుకల్లో అపశృతి

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త



అగ్నిగుండంలో పడి తీవ్రంగా గాయపడిన చాకలి ఆదినారాయణ

మోహార్రం పండుగ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం సమయంలో మండల పరిధిలోని చిన్న కౌకుంట్ల గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ అనే వ్యక్తి కాలుజారి అగ్నిగుండంలో పడిపోగా అతను తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలపాలైన చాకలి ఆదినారాయణను స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం నేరుగా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు 70శాతం శరీరం కాలిపోయినట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. చాకలి ఆదినారాయణ మోహర్రం వేడుకల్లో దివిటీలు మోస్తాడని బుధవారం తెల్లవారుజామున కూడా దివిటీలు మోశాడని ఈక్రమంలో అనుకోకుండా అగ్నిగుండ ంలో పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడని సమాచారం. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

09ATP27_09ATP27.qxd 17-07-2024 PM 10:24 Page 1






# మంగళూరు రైల్వేస్టేషన్ అప్‌గ్రేడ్ రెండునెలల్లో ప్రాజెక్టు రడీ : మంత్రి సోమణ్ణ

మంగళూరు,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


మంగళూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర రైల్వే సహాయశాఖ మంత్రి వి.సోమణ్ణ

కేరళ కర్ణాటక మహారాష్ట్రలను కలిపే మంగళూరు రేల్వై స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్రసర్కారు రెండు నెలల్లో ప్రాజెక్ట్ రూపొందించనుందని రైల్వే సహాయమంత్రి వి.సోమణ్ణ చెప్పారు. ఆయన బుధవారం మంగళూరులో మంగళూరు రైలు జంక్షన్ మరియు మంగళూరు రైల్వే స్టేషన్ పరిశీలించారు. కేరళ తిరువనంపురం నుంచి మంగళూరు మీదుగా ముంబాయిని కనెక్టు చేసే మంగళూరు రైలు స్టేషన్‌లో సదుపాయాల కొరత ఉందని చెప్పారు. మూడు రాష్ట్రాలను కలిపే ఈ రైలు స్టేషన్ ఉన్నతీకరించి ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ రైలు మార్గంలో గత 40 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని మంత్రి చెప్పారు. అటు గోవాను కూడా కలిపేది ఇదే రైలు రూటు అని చెప్పారు. మంగళూరు ఉడుపి కారవార రైల్వే స్టేషన్లను మరింత సౌకర్యమంతంగా అభివృద్ధి చేస్తాము. ఇక్కడ బందర్లను కలిపే టూరిజం కూడా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మంత్రి వెంట పాల్ఘాట్ విభాగం కేరళ రైల్వే అధికారులు మంగళూరు లోక్‌సభ బిజెపి సభ్యుడు బ్రిజేష్ చౌట, ఉడుపి చిక్కమగళూరు ఎంపీ కోట శ్రీనివాసపూజారి ఎంఎల్‌ఎలు వేదవ్యాస కామత్, హరీష్ పూంజ తదితరులు కేంద్ర మంత్రి వెంట పాల్గొన్నారు.

# దక్షిణభారత దేశంలోనే తొలి డబుల్‌డెక్కర్ ఫ్లయ్ ఓవర్ బెంగళూరులో ప్రారంభం

బెంగళూరు,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


బెంగళూరు జయనగర్ రాగిగుట్ట ప్రాంతంలో డబుల్‌డెక్కర్ ఫ్లయ్ ఓవర్‌ను ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్.

బెంగళూరులో ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచేందుకు సర్కారు కొత్తకొత్త ఫైవంతెనలను నిర్మిస్తోంది. బెంగళూరు జయనగర్‌లోని రాగిగుట్ట ప్రాంతంలో నిత్యం ఎదురవుతున్న వాహనాల ట్రాఫీక్‌ను నివారించేందుకు సర్కారు కొత్తగా ఇక్కడ డబుల్‌డెక్కర్ ఫ్లయ్ ఓవర్‌ను నిర్మించింది. రాగిగుట్ట ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డికె.శివకుమార్ కొత్త ఫ్లయ్‌ఓవర్‌ను ప్రయాణీకుల కోసం విడుదల చేశారు. రాగాగుట్ట ప్రాంతం నుంచి సిల్క్‌బోర్డ్ జంక్షన్ వరకు 3.36 కిలోమీటర్ల పొడవైన ఫ్లయ్‌ఓవర్‌ను 449కోట్ల రూపాయలతో నిర్మించారు. ఒకే రోడ్డులో కింద వాహనాల సంచారం ఫైన మెట్రోరైల్ సంచారం ఉండేలాగా ఈ డబుల్ డెక్కర్ వంతెనను నిర్మించారు. దక్షిణభారత దేశంలోనే ఇలాంటి వంతెన బెంగళూరులో మాత్రమే నిర్మాణం అయ్యింది. ఈ వంతెన నిర్మాణం వలన రాగిగుట్ట సిల్క్‌బోర్డ్‌ల మధ్య వాహనాల సంచారం మునుపు 40 నిమిషాల సమయం పడుతుంటే ఇపుడు కేవలం ఇరవై నిమిషాల్లో ఎలాంటి అడ్డంకి లేని రహదారిలో వాహనాలు వెళ్లే వీలు కుదరింది. బెంగళూరులో వచ్చే రోజుల్లో 150 కిలోమీటర్ల వైట్ ట్యాపింగ్ రహదారులను 1800 కోట్ల రూపాయలతో నిర్మిస్తామని డిసిఎంశివకుమార్ చెప్పారు. బ్రాండ్ బెంగళూరు పేరిట బెంగళూరు నగరానికి ఉత్తమ సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో బిబిఎంపి కమిషనర్ తుషార్ గిరినాథ్, పలువురు మంత్రులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 270నకిలీ ఖాతాలను తెరిచి అక్రమాలకు పాల్పడిన ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

హుబ్బళ్లి,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


హుబ్లీ ధార్వాడ పోలీసు కమిషనర్ ఎన్.శశికుమార్

ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని ప్రముఖ వాణిజ్యనగరం హుబ్బళ్లి ధార్వాడ ప్రాంతంలో సైబర్ నేరాలకు పాల్పడి కోట్లాది రూపాయలను పలు నకిలీ అక్కౌంట్ల ద్వారా దోచుకుని ముగ్గురు సైబరు నేరగాళ్లను హుబ్బళ్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ దుండగుల దురాగతాలను ఇవాళ హుబ్బళ్లి ధార్వాడ పోలీసు కమిషనర్ శశికుమార్ విలేకరులకు తెలిపారు. పోలీసులు ఢిల్లీలో నిఖిల్ కుమార్, సచిన్ బోలాను, ముంబాయిలో నిగమ్ అనే దుండగులను అరెస్టుచేసి హుబ్బళ్లికి తీసుకువచ్చారు. ఈ దుండగులు 270 నకిలీ బ్యాంకు ఖాతాలను నిర్వహించి తాము సైబర్‌నేరాల ద్వారా దోచుకున్న సొమ్మును ఈ ఖాతాలకు బదిలీ చేసుకునేవారని చెప్పారు. సాఫ్టవేర్ ఇంజనీర్లయిన ఇద్దరు దుండగులు తాము పనిచేసే కంపెనీలకు రాజీనామా చేసి సైబర్ నేరాలకు దిగారు. వీరికి ముంబాయిలోని నిగమ్ అనే మరో బట్టలవ్యాపారి తోడయ్యాడు. అతడు కూడా తన వ్యాపారాన్ని బంద్ చేసి సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపాడు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మహారాష్ట్ర, అస్సాం, మధ్యప్రదేశ్ ఢిల్లీ రాష్ట్రాల్లో ఈదుండగులు సైబర్ నేరాలకు పాల్పడి వందలకోట్ల రూపాయలను ప్రముఖుల ఖాతాలనుంచి దోచుకున్నారు. ఈ దుండగులు ఎవరో ఖాతా నుంచి డబ్బును కాజేసేందుకు వేరే వ్యక్తుల ఆధార్ కార్డులను లింక్ చేసి అసలు ఖాతాదారులకు తెలియకుండానే పెద్దమొత్తాల్లో నగదును బినామీ ఖాతాలకు తరలించేవారని పోలీసు కమిషనర్ చెప్పారు. దుండగుల జాడ కనిపెట్టిన పోలీసులు ఇపుడు నకిలీ ఖాతాల ద్వారా నగదు బదలాయింపు గురించి ఆరా తీస్తునట్లు తెలిపారు.

# కొప్పళ్ జిల్లాలో నకిలీ విత్తనాల బెడద

కొప్పళ్,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి

కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని కొప్పళ్ జిల్లా కొప్పళ్ తాలూకా కుసనూరులో బుధవారం రైతులు తాము పండించిన పెసర పంటను ధ్వంసం చేశారు. రైతులు తెలిపిన వివరాల మేరకు ఈసారి పునాస పంటగా తాము కుసనూరులో వందలాది ఎకరాల్లో పెసర సాగు చేశాము. మంచి విత్తనాల కంపెనీ అని కొప్పళ్ నుంచి పెసలు విత్తనాలు తెచ్చి ఎకరాల్లో సాగుబడి చేశాము. ఇపుడు పెసరకాయలు కట్టే సమయంలో చూస్తే ఒక్క మొక్క నుంచి కూడా కాయలు కట్టలేదు. పెసరరొట్ట మాత్రం ఏపుగా ఎదిగింది. తాము నకిలీ విత్తనాల కంపెనీను నమ్ముకుని మోసపోయామని నాగిరెడ్డి అనే రైతు చెప్పాడు. వందల ఎకరాల్లో సాగుచేసిన పెసర పంట చేయివ్వటంతో తామంతా అప్పుల పాలయ్యామని చెప్పారు. సర్కారు మాకు సాయంగా నిలబడి పంటనష్టాన్ని పరిహారాన్ని అందించాలని మనవి చేశారు. రైతులు ఈసారి మోసపోయి నకిలీ విత్తనాలను కొని తెచ్చుకున్నామని చెప్పారు. కాగా ఇవాళ రైతులు తమ పొలాల్లో ఏపుగా ఎదిగిన పెసర మొక్కలను పీకివేసి రొట్టను ఇంటికి తరలించే పనుల్లో మునిగిపోయారు. వందలాది రైతులు పెసరపంట నష్టంతో కష్టాల బారిన పడ్డారు.

# సర్కారు కార్యక్రమాలను ప్రజలకు చేర్చాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులకు సిఎం మనవి

బెంగళూరు,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


సిఎంను అభినందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

కర్ణాటక ప్రభుత్వం అమలు చేసే పథకాలను వాటి జారీ గురించి సర్కారు ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు సహకరించాలని సిఎం సిద్దరామయ్య కోరారు. ఆయన బుధవారం గృహ నివాసం కృష్ణాలో తనను భేటీచేసిన కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుల చేత సన్మానం స్వీకరించి మాట్లాడారు. నిరుడు కరువుతో సతమతమైన కర్ణాటక ఈఏడాది వానల రాకతో కాస్త దారిలోనికి వచ్చింది. కరవు సాయం పరిహారం అందచేత మరియు ఇతర అభివృద్ధి పనులకు సర్కారు తన నిధులను వ్యయం చేస్తూనే ఏడోవేతన కమిషన్ సిఫార్సుల మేరకు గవర్నమెంట్ ఉద్యోగులకు వేతన పెంపు సిఫార్సులను అమలు చేస్తుందని చెప్పారు. దీనివలన వచ్చే ఆగస్టు 1నుంచి సర్కారు ఫైన నెలకు 20వేలకోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని తెలిపారు. అయినా ఈ సిఫార్సులను అమలుచేసి తీరుతామని సిఎం చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షడాక్షరి, ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఉద్యోగుల సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

# టిపిఎంసి మార్కెట్ నుంచి అన్నభాగ్య బియ్యాన్ని చోరీచేసిన బిజెపి నాయకుడు అరెస్టు

యాదగిరి,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


యాదగిరి జిల్లా బిజెపి నాయకుడు మణికంఠ రాథోడ్.

యాదగిరి జిల్లా లోని శహపుర తాలూకా టిపిఎంసి మార్కెట్‌యార్డులో పౌరసరఫరాలశాఖ స్టాక్ చేసిన అన్నభాగ్య బియ్యాన్ని అక్రమంగా తరలించిన చిత్తాపురతాలూకా బిజెపి నాయకుడు మణికంఠ రాథోడ్‌ను షహపుర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు షహపురలోని తాలూకా టిపిఎంసి యార్డు నుంచి 2.6కోట్ల రూపాయల విలువైన ఆరుటన్నుల బియ్యాన్ని ఇతడు అక్రమంగా తరలించినట్లు పోలీసు అధికారులు పసిగట్టడంతో ఇవాళ మణికంఠను అరెస్టుచేశారు. ఈకేసును దర్యాప్తు చేస్తున్న సురపుర డివైఎస్పీ జావేద్ ఇనాందార్ మణికంఠ అతడు సోదరుడు రాజు మణికంఠకు ఈ బియ్యాన్ని విక్రయించినట్లు దుండగులు సమాచారం ఇవ్వటంతో పోలీసు అధికారులు అన్ని ఆధారాలతో వీరిని అదుపులోనికి తీసుకున్నారు. అన్నభాగ్య బియ్యం అక్రమ తరలింపు కేసులో ఇన్నిరోజులు పత్తాలేకుండా పోయిన మణికంఠ రాథోడ్ ఢిల్లీలో తల దాచుకున్నట్లు పోలీసులకు సమాచారం అందగా గాలింపు మొదలు పెట్టారు. ఇతగాడు కల్బుర్గిలోని ఒక అపార్టుమెంటులో ఉన్నట్లు పోలీసులు సరైన సమాచారం లభించటంతో ఇవాళ దాడిచేసి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. గత విధానసభ ఎన్నికల్లో మణికంఠ రాథోడ్ బిజెపి నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యాడు.

# బెళగావి జిల్లా లో కృష్ణానదికి ఉధృతం గా వరదనీరు

- గ్రామాలను ఖాళీ చేయిస్తున్న జిల్లా యంత్రాగం

చిక్కోడి (బెళగావి జిల్లా ),జూలై17,ప్రభాతవార్త ప్రతినిధి

బెళగావి జిల్లాలోని చిక్కోడి తాలూకాలో బుధవారం కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. చిక్కోడి తాలూకాలో కృష్ణానది ప్రవహించే పలుచోట్ల గ్రామాలు జలాలతో దిగ్బంధనం కావటంతో జిలాలన యంత్రాంగం ఇవాళ ఆయా గ్రామాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. బెళగావి జిల్లా కలెక్టర్ దగ్గరుండి మరీ పరిహార చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దుల నుంచి ఇవాళ 87వేల క్యూసెక్కుల జలాలు ప్రవహిస్తుండటంతో కృష్ణానది గుండా వెళ్లే కాలువల్లో భారీ వరదనీరు వెళుతుంది. దీనివలన కృష్ణానది ఇరువైపుల గట్టు వద్ద వరదనీరు పోటు పెరిగి గ్రామాల్లోకి ప్రవేశించింది. జిల్లా యంత్రాంగం కృష్ణా పరివాహక ప్రాంతం ఇంజనీర్లు దగ్గరుండి పరిహార పనులను సిబ్బందికి పురమాయిస్తున్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జిల్లా కలెక్టర్లు జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారుల సభలో సిఎం చేసిన ఆదేశాల మేరకు ఈసారి కర్ణాటకలో ప్రవహించే అన్ని నదుల నిత్యం ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో నీటి వివరాలను బెంగళూరులోని భారీ నీటి పారుదల శాఖకు పంపాలని ఆదేశించటంతో జిల్లా యంత్రాంగాలు వరదపోటు గ్రామాల రక్షణ పరిహారపనుల గురించి శ్రద్దపెట్టి మరీ పని చేస్తున్నారు. చిక్కోడిలోను బెళగావి జిల్లా కలెక్టర్ ఇదేమాదిరిగా వరదపోటు గ్రామాలను సందర్శించి పరిహార పనులను పరిశీలించారు.

# III అడుగులకు చేరుకున్న కెఆర్ఎస్

- పంటలకు నీరు వదలాలని రైతుల మనవి

మండ్య,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


కృష్ణరాజసాగర జలాశయం జలకళ.

దక్షిణ కర్ణాటక ప్రజల జీవనది కావేరి ఇపుడు జలకళ సంతరించుకుంది. మండ్య జిల్లా శ్రీరంగ పట్టణం తాలూకా లోని కెఆర్ఎస్ డ్యాం ఇపుడు 111.66 అడుగుల నీట మట్టంతో కళకళ లాడుతోంది. ఇవాళ సాయంత్రానికి ఈ డ్యాం వద్ద 111.66 అడుగుల నీటి మట్టం చేరుకుంది. ఈ డ్యాంలో 110 అడుగుల వరకు నీరు చేరుకుంటే మండ్య జిల్లా రైతులు విత్తనాలతో విత్తుడు పనులు ప్రారంభించవచ్చని వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి చెప్పటంతో రైతులు గురువారం నుంచి విత్తుడు పనులకు దిగనున్నారు. తాలూకాకు చెందిన రైతు కె.బాలకృష్ణ మాట్లాడుతూ కెఆర్ఎస్‌లో 111 అడుగులకు నీరు రావటంతో ఇకపై మండ్య వీసి కాలువకు సాగునీరు విడుదల చేయాలని మంత్రికి మనవి చేశారు. ఈ డ్యాం గరిష్ట నీటి మట్టం 124అడుగులు కాగా కావేరి నదీ పరివాహక ప్రాంతంలో వరదనీరు పెరగటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కెఆర్ఎస్ డ్యాంలో నేడు 33టిఎంసీల నీరు ఉంది.

# దేవాలయంలో జారిపడిన మాజీ మంత్రి రేవణ్ణ :విరిగిన పక్కటెముకులు

హొళెనరసీపుర (హాసన్‌జిల్లా ),జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


మాజీ మంత్రి హెచ్‌డి.రేవణ్ణ

హాసన్ జిల్లా హొళెనరసీపుర పట్టణంలో బుధవారం స్థానిక దేవాలయంలో పూజలు చేయించేందుకు వెళ్లిన మాజీ మంత్రి రేవణ్ణ అక్కడ దేవాలయంలో కాలుజారి కిందపడిపోగా పక్కటెముకులు విరిగాయి. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల మేరకు ఈఏడాది తొలి ఏకాదశి పర్వదినం ఆచరణకోసం హొళెనరసీపుర పట్టణం లోని శివుడి దేవాలయంలో పూజల కోసం వెళ్లగా అదుపుతప్పి బొక్కబోర్లా కిందపడిపోయారు. ఈహఠాత్ ప్రమాదంలో ఆయనకు ఎడమ పక్కటెముకులు రెండు విరిగాయి. భారీ కాయంగా ఉన్న హెచ్‌డి. రేవణ్ణ ఈ హఠాత్ పరిణామానికి కంగుతిని మూగగా రోదించాడు. వెంటనే ఆయన సహచరులు స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. హాసన్‌లో మరింత చికిత్సకోసం చేరగా అక్కడి వైద్యులు రేవణ్ణకు ప్రమాదం పెద్దగా జరగలేదని ఆయన ఆరువారాల పాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. వైద్యులసలహామేరకు రేవణ్ణబెంగళూరునివాసానికి బయలుదేరారు.

# బెంగళూరు ఎంఎల్‌ఎలతో సిఎం సమావేశం

- నగరం మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి చర్చ

బెంగళూరు,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


బెంగళూరు కృష్ణాలో బుధవారం నగర ఎంఎల్‌ఎలు మంత్రులతో సిఎం చర్చలు.

బెంగళూరు నగరం చుట్టూ ఫెరిఫెరల్ రింగ్‌రోడ్డు నిర్మాణం, స్కైడెక్ నిర్మాణం, నూతన ఫ్లయ్‌ఓవర్ల నిర్మాణం, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ సమస్యల గురించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం నగర శాసనసభ్యులతో చర్చలు జరిపారు. బెంగళూరును గ్లోబల్ హబ్‌గా టెక్నాలజీలో అగ్రగామిగా అభివృద్ధి చేసేందుకు నూతన ప్రయాణ సౌకర్యాలను సమకూర్చాల్సి ఉందన్నారు. ఇందుకోసం సర్కారు బెంగళూరుకు ఈఆసరి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. నగరంలో సులలితంగా వాహన ప్రయాణం జరిగేందుకు వీలుగా రోడ్లను విస్తరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సంచార రద్దీ నివారించేందుకు టన్నెల్ నిర్మాణం, హైడెన్సిటి కారిడార్‌ను నిర్మించేందుకు సర్కారు ప్రతిపాదనలు సిద్దంచేసింది. వీటి జారీకు నగర ఎంఎల్‌ఎల సహకారం అవసరమని సిఎం చెప్పారు. ఫెరిఫెరల్ రింగ్‌రోడ్డ నిర్మాణం కోసం టెండర్లు పిలిచినా స్పందన రాలేదు. మరోసారి ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిధుల సేకరణ గురించి కూడా సవివరాలతో వచ్చే కెబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. నగరంలో నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్త వ్యర్థ పదార్థాలను శాస్రీయంగా తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వరదనీటి కాలువల నిర్వహణ కోసం బఫర్‌జోన్ నిర్వహణ అవసరమని చెప్పారు. సభలో ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్, మంత్రుల రామలింగారెడ్డి, కెజె.జార్జి, కృష్ణ బైరేగౌడ. బైరతి సురేష్ దినేష్ గుండూరావు తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో పోలీసులు అందరూ నిత్యం 5గంటలపాటు పబ్లిక్‌ప్లేసుల్లో ఉండాలి : డీజిపి ఆదేశాలు

బెంగళూరు,జూలై 17,ప్రభాతవార్త ప్రతినిధి


బెంగళూరులో మాట్లాడిన డీజిపి అలోక్ మోహన్

కర్ణాటకలో పోలీసులు అందరూ ఇకమీదట నిత్యం కచ్చితంగా 5గంటలపాటు పబ్లిక్‌స్థలాల్లో గస్తీ తిరగాలని రాష్ట్ర ఐజి డీజిపి అలోక్‌మోహన్ బుధవారం ఆదేశించారు. ఈమేరకు అన్ని కమిషనరేట్లకు ఎస్పీలకు జోన్ల ఐజీపిలకు సిఐ ఎస్సైలకు ఆదేశాలు చేశారు. ఇటీవల చాలా చోట్ల సార్వత్రిక స్థలాల్లో పోలీసులు హాజరు తగ్గుముఖంగా ఉండటంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు డీజిపి చెప్పారు. పోలీసులు మార్కెట్లలోను రద్దీ రహదారుల్లోను ఒంటరి ప్రాంతాల్లోను తప్పనిసరిగా గస్తీ తిరగాలని రోజుకు 5గంటలపాటు పోలీసులు విజిట్ చేస్తే సమస్యలు పరిహారం అవుతాయని చెప్పారు. వివిధ టౌన్లలో మట్కాలు, చిల్లరమల్లర దొంగతనాలు దొమ్మీలు, మహిళలు యువతులపై పబ్లిగ్గా దౌర్జన్యాలు జరుగుతున్న దృష్ట్యా పోలీసులు గస్తీ తిరగాలని చెప్పారు. పగటి వేళల్లోనే పోలీసులు పబ్లిక్‌కు అందుబాటులో ఉండాలి. రాత్రి గస్తీ గతం మాదిరిగా కొనసాగాలని ఆదేశించారు.

# ఓబుళేసుని కొండపై ఏకాదశి ఉత్సవాలు

పుట్టపర్తి రూరల్ జులై 17 ప్రభాతవార్త


ప్రత్యేక అలంకరణలో ఓబుళేశ్వర స్వామి

మండల పరిధిలోని ధర్మవరం–గోరంట్ల ప్రధాన రహదారిలో జగరాజుపల్లి వద్ద కొండపై వెలసిన ఓబుళేశ్వర స్వామి ఏకాదశి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి కొత్తచెరువు గోరంట్ల, బుక్కపట్నం, మండలాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొండపైకి వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు కొండపై దిగువ భాగాన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. అధిక వర్షాలు వలన కొండపైకి వెళ్లెందుకు రహదరి సరిగ్గా లేని కారణం నిర్వహకులు గత రెండు రోజుల నుండి వాటికి మరమ్మత్తులు చేయించి భక్తుల సహాయంతో కళ్యాణ మండపం నిర్మాణ దశలో ఉంది, ఆలయ కమిట2ఈ సభ్యులు కొండపైభాగాన తాత్కాలిక షెడ్డు నిర్మాణం చేయించి భక్తులు కొండపూకి సులువఉగా వెళ్లెందుకు అన్ని సౌకర్యాలు చేశారు. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబుళేశ్వర స్వామి దేవస్థానం సేవాసమితి అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య సలహాదారుడు వాసుదేవరెడ్డి, జాయింట్ సెక్రెటరీ దయ్యాల ఉమాపతి, ఓబుళేశ్వర స్వామి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్య జయంతిని నిర్వహిస్తున్న సంఘం సభ్యులు.

గోరంట్ల జులై 17 ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణం నందు బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేవరకొండ ఉమా శంకర్ ఆధ్వరనయంలో ఏకలవ్యుని మహారాజ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఉమా శంకర్ మాట్లాడుతూ ఎరుకల ఆరాధ్యదైవమైన ఏకలవ్య మహారాజు జయంతిని ప్రభుత్వమే అధికారికంగా జరపాలని ఆదే రోజున సెలవుదినంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి సందర్భంగా విన్నవించుకున్నట్టు తెలిపారు. అలాగే వెనుకబడిన ఉన్న ఎరుకలను ఆర్ధికంగా ఆదుకోవాలని దీంతొ ఎరుకులతో ఆర్థికంగా వెసలుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ దేవరకొండ ఉమాశంకర్, సత్యసాయి జిల్లా గుజ్జుల రవి మహిళా అధ్యక్షురాలు గుజ్జుల గంగులమ్మ జిల్లా ప్రధానకార్య దర్శి సాకే వెంకట్ రాముడు, గోరంట్ల టౌన్ ప్రెసిడెంట్ నరసింహులు సలహాదారులు నారాయణస్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# హోల్‌సేల్ దుకాణాల్లో బియ్యం, కందిపప్పు అమ్మకాలు

-విడపనకల్లులో దుకాణాల్లో ప్రారంభించిన తహశీల్దార్ దస్తగిరయ్య

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త


వినియోగదారుడికి కందిపప్పు అమ్మి డబ్బులు తీసుకొంటున్న తహశీల్దార్ దస్తగిరయ్య తదితరులు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు సరసమైన ధరలతో నాణ్యమైన సరుకుల అమ్మకం బుధవారం విడపనకల్లు మండల కేంద్రంలోని రెండు హోల్‌సేల్ దుకాణాలవద్ద ప్రారంభమైంది. రైస్ మిల్లర్స్, హోల్‌సేల్ డీలర్స్ అసోసియేషన్ సౌజన్యంతో దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు అమ్మకాలను తహశీల్దార్ దస్తగిరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ దస్తగిరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం దేశవాళి కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కేజీ 181 రూపాయలు ధర ఉండగా ఎంపిక చేసిన రిటైల్ దుకాణాలవద్ద 160 రూపాయలకు, స్టీమ్, బిటిపి, సోన మసూరి బియ్యం మార్కెట్‌లో కేజీ ధర 55.85 రూపాయలు ఉండగా 49 రూపాయలకు, పచ్చి, బిటిపి, సోన మసూరి బియ్యం కేజీ ధర 52.40 రూపాయలు ఉండగా 48 రూపాయలకు విక్రయించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని వినియోగదారులు సది ్వనియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ లక్ష్మిదేవి ఆర్ఐ వన్నప్ప సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్యుడి జయంతి వేడుకలు

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త


ఏకలవ్యుడి చిత్రపటంవద్ద పూజలు నిర్వహిస్తున్న ఎరుకుల కులస్తులు

ఎరుకుల ఆరాధ్య దైవమైన ఏకలవ్యుడి జయంతి వేడుకలు బుధవారం ఉరవకొండ పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుండి డప్పువాయిద్యాల నడుమ ఏకలవ్యుడి చిత్రపటాన్ని పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. క్లాక్ టవర్ కూడలిలోగల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం కవితా హోటల్ సర్కిల్‌కు చేరుకొని అక్కడ ఏకలవ్యుడి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అక్కడే కేక్ కోసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్, నియోజకవర్గ అధ్యక్షులు సాకే వసంత్, ప్రధాన కార్యదరి ్శ సాకే పురుషోత్తం, కార్యదర్శి సాకే మహీంద్ర, సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులు వై.గంగన్న, నాయకులు, నరసింహులు, వీరేష్, ఆంజనేయులు, శేషాద్రి, అజ్జప్ప, వీరేంద్ర, సోమశేఖర్, సుధాకర్, వై.హనుమంతు, టీచర్ ఎర్రిస్వామి, జలంధర్ రాజు, శ ంకరయ్య, వై.ఆంజినేయులు, చిన్న దేవన్న, వై.రాము, వై.తిమ్మప్ప, ప్రసాద్, ఉరుకుందప్ప, శంకరప్ప, ఎర్రిస్వామి, ఎరుకల సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల నడుమ మొహర్రం పర్వదిన వేడుకలు

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త


భక్తజన సందోహం మధ్య పెద్ద లాలుస్వామి పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం


పీర్ల ఊరేగింపు దృశ్యం



త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగ వేడుకలు ఉరవకొండ మండలంలో అత్యంత వైభవంగా బుధవారం ముగిశాయి. మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తు సందర్బంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పీర్ల చావిళ్ల భక్తులతో కిటకిటలాడాయి. పీర్లకు గొడుగులు, వస్త్రాలు, ఇతరత్రా బంగారు, వెండి ఆభరణాలు అందించడంతోపాటు చక్కెర, బెల్లం తులాభారాలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రే పీర్ల చావిళ్ల ముందు అగ్నిగుండాలు వెలగించగా ఆదివారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండాల ప్రవేశంచేశాయి. పట్టణంలో కొలువుదీర్చిన పీర్లను సాయంత్రం 5గంటలకు ప్రత్యేకప్రార్థనల అనంతరం ప్రత్యేకంగాఅలంకరించి ఊరేగింపులు లేకుండా స్థానిక జైనబ్బీ దర్గావద్ద కలయిక, పరస్పర ఆలింగనాల అనంతరం జలధికి కార్యక్రమం నిర్వహించారు. బావులు, చేతి పంపులవద్ద పీర్లను శుభ్రంచేసి ఆభరణాలు, వస్త్రాలను ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచి ప్రార్థనల అనంతరం చావిళ్లకు చేర్చారు. దీంతో 10 రోజులపాటు కొనసాగిన పెద్ద మోహర్రం వేడుకలు ముగియగా గురువారం రోజు నుండి చిన్న పీర్ల పండుగ ప్రారంభం కాకుంది. కాగా పీర్లపండగ సందర్బంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ సురేష్ బాబునేతృత్వంలో సిబ్బంది ప్రత్యేకబందోబస్తు నిర్వహించారు. పట్టణంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో సైతం పండుగ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా కొనసాగడం విశేషంగా చెప్పాలి.

# బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాల ఫ్లెక్సీ ఆవిష్కరణ

-ఆగస్టు 29న అమ్మవారి ఉరుసు ఉత్సవం

ఉరవకొండ, జూలై 17 ప్రభాతవార్త


ఉరుసు ఉత్సవాల ఫ్లెక్సీను ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ బాధ్యులు

హిందూ ముస్లీం లసమైఖ్యతా చిహ్నంగా నిలిచే ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ (ర.అ.) వారి ఉరుసు ఉత్సవాల ఆహ్వాన ఫెక్సీను దర్గా కమిటీ ఆదివారం ఆవిష్కరించింది. ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం దర్గాలో అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం దర్గా ఆవరణంలో ఏర్పాటు చేసిన భారీ ఫెక్సీను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా దర్గా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 28న బుధవారం గంధం, 29న గురువారం ఉరుసు, 30న శుక్రవారం జియారత్ కొనసాగుతుందన్నారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రెసిడెంట్ హోతూరు భాషా, సెక్రెటరీ జి.యం.ఎస్.షాకీర్, ట్రెజరర్ జండా జిలాన్ భాషా, వైస్ ప్రెసిడెంట్ బ్యాళ్ళ ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ పామిడి జాకీర్, టీమ్ మేనేజర్ బళ్లారి సాదిక్, గౌరవ సలహా సభ్యులు మెకానిక్ కె.అబ్దుల్ రహిమాన్, బొంబాయి సేట్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తొలి ఏకాదశి


శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీనారాయణస్వామి

పామిడి, జులై 17 ప్రభాతవార్త

శ్రీ అనంత గజ గరుడ లక్ష్మినారాయణస్వామి దేవాలయం నందు బుధ వారం తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. స్వాముల వారిని ప్రత్యేక ంగా అలంకరించిన అర్చకులు విశ్వనాథశర్మ అభిషేకం అర్చనలు పూజలను చేపట్టారు. భక్తాదులు విష్ణు సహస్ర నామపారాయణం పఠిస్తూ భక్తిగీతా లాపన గావించారు. మూల విరాట్‌కు పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మినారాయణస్వామి వార్లను పల్లకిలో ఉంచి గోవింద నామ స్మరణ మధ్య ఆలయం చుట్టూ ప్రాకారోత్స వం జరిగింది. తొలి ఏకా దశిని శయన ఏకాదశిగా పిలుస్తారని మహావిష్ణువు పాల కడలిపై పవళి ంచిన రోజు కావటం ఒక విశిష్టత. పూర్వం సంవత్స రాన్ని తొలి ఏకాదశిన ప్రారం భించేవారని ఆలయ అర్చకులు విశ్వనాథశర్మ తెలిపారు. తొలి ఏకాదశిని పుర స్కరించుకుని పెద్దఎత్తున దేవాలయానికి


గోవింద నామ స్మరణల మధ్య స్వామి వారి ప్రాకారోత్సం

చేరుకున్న భక్తులు పూజలు చేపట్టి స్వాముల వారి కృపకు పాత్రులవుతూ తీర ్థప్రసాదాలను స్వీకరించారు. ఇదిలా వుండగా శ్రీ రంగసుభే ఫిర్కా వారి విటోబ ఆలయంలో తొలి ఏకాదశిని పుర స్కరించుకుని అభిషేకం అర్చన కలశ స్థాపన ధ్వ జారోపణ ప్రాకారరోత్స వం నివేదన హారతి అన్నదానం చేశారు. ఆలయాల సామాజిక కార్యకర్తల కే.నారాయణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ఆర్యవైశ్యసంఘం సభ్యులు, భకాదులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన దొడ్డిగుండ్ల అక్కమ్మగారి పరుస,ఎడ్లబండ్ల పోటీలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అక్కమ్మగారి విగ్రహాలు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అక్కమ్మగారి విగ్రహాలు.

పుట్టపర్తి రూరల్ జులై 17 ప్రభాతవార్త

పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామ సమీపంలో దొడ్డిగుండ్ల అక్కమ్మగారి పరుస మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి పెడపల్లి కాయలొల్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఏడుగురు చిన్నారులతతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. పెడపల్లి పంచాయితీ పరిదిలోని గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం ఎడ్ల బండ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ మండలాల నుండి వచ్చిన రైతులు ఎడ్ల బండ్ల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా నల్లగుట్లపల్లి రాము పదివేల రూపాయలు, గెలుచుకోగా, ద్వితియ బహుమతిగా 8వేలు, తృతియ బహుమతిగా 6వేల రూపాలయాలను కొత్తచెరువు కేశవ, జంగం శ్రీనివాలసులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వాసులే కాక ఇతర మండల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సంద్భంగా పెడపల్లి డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా నిర్వాహకులు కాయల రాము, టిడిపి నాయక ులు మాజి సర్పంచ్ శ్రీరామ్‌నాయక్, శివప్ప, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్‌రెడ్డి ఆకుల కుళ్లాయప్ప, వెంకటరాముడు, గువ్వలగుట్టపల్లి గంగాధర్, వీరజి న్న. మని. వీఆర్‌ఏ గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

# జనసంద్రం నడుమ పీర్ల భేటీ

## - అంబరాన్నంటిన మొహరం సంభరాలు - జలదితో ముగిసిన వేడుకలు


బత్తలపల్లి కూడలిలో భేటీ అవుతున్న పీర్లు


బత్తలపల్లి చావిడివద్ద పూజలు నిర్వహిస్తోన్న వివిధ గ్రామాల పీర్లు


కూడలిలో అలావ్ తొక్కుతున్న యువకులు


భేటీ సందర్భంగా కూడలిలో గుమిగూడిన ప్రజలు

బత్తలపల్లి, జులై 17 ప్రభాతవార్త

జిల్లాలోనే గూగూడు తరువాత రెండవ గూగూడుగా ప్రసిద్ధికెక్కిన బత్తలపల్లి, వెంకటగారిపల్లి సమీపంలో బుధవారం వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ వివిధ గ్రామాల పీర్లు బేటీ అయ్యాయి. ఈ సంభరాలు జనా ల మధిలో అంభరాన్నంటాయి. మొహరం వేడుకలలో చివరి రోజైన 10వ రోజు మండలకేంద్రంలో గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవం పల్లి గ్రామాల పీర్లు బత్తలపల్లి పీర్లతో బేటీ అయ్యాయి. అంతేకాక మండ లంలోని పలు గ్రామాలలో నిలిపిన పీర్లకు ఆయా గ్రామాలలోనే వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలో జరిగిన వేడుకలలో చిన్నా, పెద్ద, మహిళ లనే తారతమ్యం లేకుండా పాల్గొని చిందులు వేయడంతో పాటు పీర్ల బేటీని అనందంతో తిలకించారు.

గ్రామాల వారీగా పీర్లు బేటీ అయిన తరువాత బత్తలపల్లిలోని పీర్లమకాన్ వద్దకు వెళ్లి చదివింపులు చేశారు. బేటీ సమ యంలో భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లం వుండలను పీర్ల పైకి విసిరి తమ మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజామునుండే ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగిన అనం తరం పీర్లను గ్రామ పురవీధు లలో ఊరేగించారు. కూడలిలో బేటీని ప్రజలు సమీప మిద్దెలెక్కి తిలకిం చారు. యువకులు, భక్తులు కేరింతలతో చిందులేశారు. విశేష సంఖ్యలో బేటీ ని తిలకించడానికి ప్రజలు రావడంతో కూడలి కిక్కి రిసిపోయింది. నాలుగు రోడ్ల కిరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. డప్పులు, తప్పెట్లు, ఈలలు, అరుపులతో కూడ లి హోరెత్తి పోయింది. భేటీ సందర్భంగా కూడలిలో ఎటు వంటి ఆవాం చనీయ సంఘటనలు జరగకుండా సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, పదుల సంఖ్యలో పోలీసులు బందోభస్తు నిర్వహిం చారు. ఆయా గ్రామాల పెద్దలు జన సందోహన్ని కట్టడి చేశారు. బేటీల అనంతరం బత్తలపల్లి చావిడి ముందరి అగ్నిగుండం దగ్గర జంతుబలులు గావించారు. సాయంకాలం పీర్లతో పాటు ప్రజలు అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం పీర్లను విషాద వదనాలతో జలధికి తరలించారు. దీంతో 10రోజులుగా గ్రామాలలో నెలకొల్పిన పీర్ల ఉత్సవం ముగిసింది. వెంకటగారిపల్లి సత్రం వద్ద వెంక టగారిపల్లి, లింగారెడ్డిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం గ్రామాలకు చెం దిన పీర్లు బుధవారం బేటీ తీసుకున్నాయి. సంజీవపురం కాటకోటేశ్వ రక్షేత్రం వద్ద సంజీవపురం, ఈదుల ముష్టూరు గ్రామాల పీర్లు భేటీ తీసుకున్నాయి.

# మంత్రి లోకేష్‌ను కలిసిన మహిళా టీచర్లు



కొత్తచెరువు జులై 17 ప్రభాతవార్త

గుంటూరులోని ఐటి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ను సావిత్రిభాయి పూలే మహిళా టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి విజయలక్ష్మి, గుంటూరు జిల్లా అధ్యక్షులు టి లక్ష్మి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

అనంతరం మంత్రికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంగా మహిళా విద్యాశాఖలో ఎరుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంఘం నాయకురాలు తెలిపారు. ఆయన స్పందించి త్వరలో పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు.

మంత్రికి వినతి పత్రం ఇస్తున్న మహిళా టీచర్ల సంఘం సభ్యులు

# దగ్గుపాటి గెలిచారు - మొక్కులుతీర్చుకున్నారు

## - నగరంలో టెంకాయల వ్యాపారుల ఆనందోత్సాహాలు
## - శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో 116 కొబ్బరికాయలు కొట్టిన వ్యాపారి జహీర్

అనంతపురం, జులై 17 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా దగ్గుపాటి ప్రసాద్ గెలవడంపై టెంకా యల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గెలుపు కోరుకున్న వ్యాపారులు బుధవారం మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా దగ్గుపాటి ప్రసాద్ గెలిస్తే 116 టెంకాయలు కొడతానని పచ్చ టెంకాయల వ్యాపారస్తుడు జహీర్ మొక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో నగరంలోని కోవూరునగర్‌లో వున్న శ్రీవెంకటేశ్వస్వామి దేవాలయంలో 116 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో టెంకాయల వ్యాపారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దగ్గుపాటి ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని వారు ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, మాజీ కార్పొరేటర్ రాజారావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసిం హులు, నెట్టంసూరి, పచ్చ టెంకాయల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు ఉ త్తప్ప, సంఘం నాయకులు నగేష్, అంజి, గోవిందు, చాంద్, బయప్ప, శ్యా మ్, బాష, శంకర్, ఆంజనేయులు, ఆది, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో వ్యాపారి జహీర్

# ఏపి ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏకలవ్యుని జయంతి

## - వచ్చే ఏకలవ్యుని జయంతికి నగరంలో విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే.
## - ఎరుకుల జాతికి మహనీయుడు మహారాజ్ ఏకలవ్యుడు : సాకే వీరాంజనేయులు

అనంతపురం రూరల్, జూలై17ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం అనంత నగరం లోని నవోదయ కాలనీలో ఏపి ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే చిరంజీవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే వీరాంజినేయులు, మహి ళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, సంఘ సభ్యులతో కలసి ఏకలవ్యుని చిత్రప ట్టానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్ హాజరై ఏకలవ్యుని చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే సంవ త్సరం నాటికి నగరంలో ఏకలవ్యుని విగ్రహ ఏర్పాటుకు స్థలంను కేటాయించి నా స్వంత ఖర్చులతో ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటు చేస్తాన్నన్నారు. అలాగే సిఎం నారా చంద్రబా బునాయుడుతో మాట్లాడి ఎరుకల కార్పోరేషన్ ఏర్పాటుకు కృషి చేసి రాష్ట్రంలోని ఎరుకల కులస్తులను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఈ సందర్బంగా ఏపి ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే వీరాంజినేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి పురష్కరించుకుని ఎరుకల జాతి ఆణిముత్యం ఏకలవ్యుని జయ ంతిని ఘనంగా నిర్వహించుకోవడం ఆనవా యితీగా చేపట్టడడం జరుగుతుందన్నారు.

ఎరు కల జాతి ఆణి ముత్యం, ఆదిముల పురుషుడు, విలువిద్యలో మేటీ, గొప్ప త్యాగశీలి, మహభార తంలో గురుభక్తీని చాటే గొప్ప ఔన్నత్వం ఉన్న మహనీ యుడు మహరాజ్ ఏకలవ్యుడు అని చరిత్ర ఉన్ననాళ్ళుగొప్పగాచెప్పుకునే వ్యక్తి ఏకలవ్యుడనేన్నారు. అనంత రం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సాకే హరి, బాల అంజినప్ప, సాకేశ్రీని వాసులు, గుజ్జలగంగా ధర్, శ్రీరా ములు, క్రిష్టప్ప, శివయ్య, గాయిత్రి, సాకే మురళి, సాకే సోమశేఖర్, సుంకన్న, టీచర్లు, గిరిజన కుల సంఘ నాయకులు, ఎరుకల కులస్తులు పాట్గొన్నారు.


ఏకలవ్యుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న దృశ్యం.

# ప్రశాంతినిలయంలో ప్రతిధ్వనించిన పంఢరీశుని నామం


డిండి నృత్యం చేసున్న మహరాష్ట్ర యువకులు


భాగవత నృత్యం నేపథ్యంలోని సన్నివేశం

పుట్టపర్తి రూరల్ జులై 17 ప్రభాతవార్త

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఆషాడ ఏకాదశి వేడుకలు అందరాన్నంటాయి. మహారాష్ట్రా నుండి పుట్టపర్తికి విచ్చేసిన సాయిభక్తులు అద్భుతమైన శ్రీకృష్ణ భాగవాతం నేపధ్యం కలిగిన నృత్య రూపకాన్ని మహారాష్ట్ర యువకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంఢరీపురీశుని వేషదారణలో విఠలా నామ జపాన్ని ఆలపిస్తూ వారి సాంప్ర దాయ నృత్యాలను కొనసాగించారు.

సాయంత్రం నేవి ముంబై నుండి బాలవి కాస్ విద్యార్థులు వేద పఠనంతో ప్రారంభించి వేడుకలను కొనసాగిం చారు. ఈ సందర్భంగా బాలవికాస్ చిన్నారులు నాటికలను ప్రదర్శిం చారు. ఈ ప్రదర్శనలో కలియుగంలో భగవంతుడికి చేరువ కావాలంటే భగవంతుని నామస్మరణే కీలకం అనే ఇతివృత్తంతో ఈ నాటిక కొనసాగింది. అనతరం జోనల్ ప్రెసిడెంట్ అనుప్ సక్సేనా మాట్లాడుతూ పంఢరీనాథు నికి, శ్రీసత్య సాయికి మధ్య సారూపత్యను మరియు భక్తి మరియు ప్రేమ మొక్క ప్రాము ఖ్యతను వివరించే విధంగా ప్రసంగం సాగింది. అనంతరం వారిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు బాబా చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్ర మంలో వేలాది మంది మహారాష్ట్ర భక్తులు. బాలవికాస్ చిన్నారు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఎస్కేయూలో వసతి గృహంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం, జులై 17, ప్రభాతవార్త ప్రతినిధి

శ్రీకృష్ణదేవరాయల యూనివర్శిటీలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయతా ్ననికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్కేయూలో పులివె ందులకు చెందిన ఓ విద్యార్థిని ఎంబీఏ రెండో సంవత్సరం చదువు తోంది. కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె బుధవారం ఎస్కేయూ వసతి గృహంలోని తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహ త్యాయ త్నానికి పాల్పడింది. ఫ్యానుకు వేలాడుతున్న యువతిని గమనించిన తోటి విద్యార్థులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# షిరిడీకి బయలుదేరిన అన్నదాన సామాగ్రి


షిరిడికి బయలుదేరుతున్న అన్నదాన సామాగ్రి

అనంతపురం ఓల్డ్‌టౌన్, జూలై 17 ప్రభాతవార్త

గురుపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీషిరిడిసాయిబాబా అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి నిత్యావసరవస్తువులతో కూడిన అన్నదాన సామాగ్రితో షిరిడికి వాహనం బయలుదేరింది. బుధవారం అనంతపురం నగరం నుండి వివిధ వర్గాల నుండి ఉచితంగా సేకరించిన వంట సామాగ్రితో కూడిన వాహనాన్ని అన్నదాన సేవాసంఘం సభ్యులు పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారం భించారు. దాదాపు నాలుగు రోజుల పాటు గురుపౌర్ణమి సందర్భంగా షిరిడిలో ఉదయం కాఫీతో మొదలై రాత్రి భోజనం వరకు నిత్యాన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి గురుపౌర్ణమి సందర్భంగా షిరిడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమంలో ప్రతి ఏడాది లక్షకు పైగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరిస్తారని ఈ ఏడాది కూడా లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశాలు వున్నాయని వారు తెలిపారు.

# అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

అనంతపురం, జూలై 17 ప్రభాతవార్త బ్యూరో

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే కమ్యూనిస్టు యోధుడు కీర్తిశేషులు కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి వర్ధంతి ని పురస్కరిం చుకుని గురువారం ఉదయం 10 గంటలకు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో అనంతపురం లోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయా లని నిర్వాహకులు కోరారు.


కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి

# శ్రీవెంకటేశ్వరస్వామి వారి గర్బగుడి ప్రతిష్ఠ

## -పూజా కార్యక్రమానికి హాజరైన బీజేపి మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్‌జాన్
## షేక్ బాబ్‌జాన్ స్వామివారి చిత్రపటంను అందజేస్తున్న గ్రామస్తులు

**నల్లచెరువు, జూలై 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గోరంట్లవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబడిన శ్రీవెంకటేశ్వరస్వామి గర్బగుడి ప్రతిష్ట కార్యక్రమానికి బీజేపి ఆంధ్రప్రదేశ్ రా ష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్‌జాన్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. షేక్ బాబ్‌జాన్ తన వంతు సహాయంగా శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ. 3500 విలువగల మైక్‌సెట్‌ను విరాళంగా అందజేయడం జరిగింది. అనంతరం గ్రామస్థులు మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్‌జాన్‌ను సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అశోక్, ఓబిసి మోర్చా ఎన్‌పికుంట మండల అధ్యక్షులు కెవి రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

షేక్ బాబ్‌జాన్ స్వామివారి చిత్రపటంను అందజేస్తున్న గ్రామస్తులు

